గీత దాటొద్దు..

● అధిష్ఠానం ఆదేశాలతో వెనక్కి తగ్గిన ఎమ్మెల్యేలు

రంగంపేట, న్యూస్‌టుడే: వరంగల్ ఉమ్మడి జిల్లా కాంగ్రెస్‌లో విభేదాలు, వివాదాలపై అధిష్ఠానం సీరియస్‌గా ఉంది. 'ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవ్వలేదు.. అప్పుడే ఈ గొడవలు, ఫిర్యాదులు ఏమిటి?.. ఎవరూ 'గీత దాటొద్దు' అని ప్రజాప్రతినిధులను హెచ్చరించినట్లు తెలిసింది. ద్వితీయ, కిందిస్థాయి కార్యకర్తలకు ఇదే విషయం చెప్పాలని ఏఐసీసీ, టీపీసీసీ ముఖ్య నాయకులు స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ పార్టీలో గొడవలేమిటని అడిగినట్లుగా తెలిసింది. ఎవరిది తప్పు? ఒప్పు అనేది అందర్నీ సమావేశ పరిచి చర్చిద్దాం.. ఎవరూ తొందరపడి ఎలాంటి వ్యాఖ్యలు చేయొద్దని సూచించారు. దీంతో ఎమ్మెల్యేలు వెనక్కి తగ్గినట్లుగా పార్టీ వర్గాలంటున్నాయి.

● గీసుకొండ పోలీసు స్టేషన్, ధర్మారంలో జరిగిన ఘటనలతో మంత్రి కొండా సురేఖపై ఎమ్మెల్యేలు రెండు, మూడు రోజుల పాటు హైదరాబాద్‌లో మకాం వేసి ఏఐసీసీ రాష్ట్ర పరిశీలకురాలు దీపాదాస్ మున్షీ, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్‌కు కలిసి ఫిర్యాదు చేశారు. ఒకదశలో దిల్లీకెళ్లేందుకు సిద్ధమవ్వగా అధిష్ఠానం పెద్దలు వారించడంతో విరమించుకున్నారని తెలిసింది.

పరకాల, తూర్పు పైన దృష్టి

పరకాల, వరంగల్ తూర్పు నియోజకవర్గాలపై అధిష్ఠాన పెద్దలు దృష్టి సారించారు. ఇక్కడే ఎందుకు తరచూ వివాదాలు అనే కోణంలో సమగ్ర సమాచారం సేకరిస్తున్నట్లుగా తెలిసింది. తూర్పు, పరకాలలో నేతల పోటాపోటీ పర్యటనలతో ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు గ్రూపులు కడుతున్నారని ఇప్పటికే పార్టీకి సమాచారం చేరింది. స్థానిక ఎమ్మెల్యేలు ఎవరి పరిధిలో వారు పనిచేయాలని సూచించినట్లుగా తెలిసింది.

న్యాయమూర్తి బదిలీ

వరంగల్ న్యాయవిభాగం, న్యూస్‌టుడే: వరంగల్ జిల్లా నాల్గో అదనపు మున్సిఫ్ మెజిస్ట్రేట్ జె.శశి బదిలీపై జనగామ జిల్లా ప్రధాన జూనియర్ సివిల్ జడ్జిగా వెళ్తున్నారు. జనగామ జిల్లా ప్రధాన జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేసిన ఇ.సుచరిత జిల్లా సీనియర్ సివిల్ జడ్జిగా పదోన్నతి పొందిన విషయం తెలిసిందే. ఆ స్థానంలో న్యాయమూర్తి శశి వెళ్తున్నారు.

మార్పు కోసం.. మన పాలనాధికారులు





వినూత్న ఆలోచనలతో ముందడుగు

ఉమ్మడి వరంగల్ పరిధిలోని ఆరు జిల్లాల్లో పాలనాధికారులు వినూత్న కార్యక్రమాలతో అభివృద్ధికి బాటలు వేస్తున్నారు.. ప్రజల హృదయాలను గెలుచుకుంటున్నారు. పాలనలో తమదైన ప్రత్యేక ముద్ర వేస్తూ కీలకమైన విద్య, వైద్య రంగాల్లో మార్పులకు శ్రీకారం చుట్టారు. ముఖ్యంగా ములుగు, జనగామ, వరంగల్ పాలనాధికారులు రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా చేపట్టిన కార్యక్రమాలు స్ఫూర్తిగా నిలుస్తున్నాయి.



దుగ్గొండి బాలుర వసతిగృహంలో ఫిర్యాదుల పెట్టెను తెరుస్తున్న విద్యార్థులు

విద్యార్థుల ఉన్నతిలో 'కీ'రోల్

జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ వసతిగృహాలు, కస్తూర్బా విద్యాలయాలు, గురుకులాల్లోని విద్యార్థుల ఉన్నతిపై **వరంగల్ పాలనాధికారి డా.సత్యశారద** దృష్టి సారించారు. వారి సమస్యలు తెలుసుకునేందుకు వసతిగృహాలు, గురుకులాల్లో ఫిర్యాదుల పెట్టెలను ఏర్పాటుచేశారు. వాటి తాళాలు ఆమె వద్దే ఉంటాయి. విద్యార్థులు తమ సమస్యలను చీటీల్లో రాసి పెట్టెలో వేస్తున్నారు. ఎవరు ఫిర్యాదు చేశారో వార్డెన్, ఇతర సిబ్బందికి తెలియనీయకుండా.. విద్యార్థుల డార్మెంటరీలలోనే వాటిని ఏర్పాటుచేశారు. ఆకస్మిక తనిఖీల సమయంలో పాలనాధికారి పెట్టెలను తెరిచి సమస్యలు తెలుసుకుంటున్నారు. పరిష్కార దిశగా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేస్తున్నారు. దాంతో వసతిగృహాలు, గురుకులాల సిబ్బంది విద్యార్థులకు అందించే భోజనాలు, శుభ్రతపై అప్రమత్తంగా ఉంటున్నారు. ● ఫిర్యాదుల పెట్టె ద్వారా విద్యార్థులు కోరినట్లు నవంబరు 15 లోగా దుప్పట్లు పంపిణీ చేస్తామని పాలనాధికారి తెలిపారు.

–వరంగల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే



ఆసుపత్రిలో రిజిస్టర్ పరిశీలిస్తూ..

ప్రతి సమస్య నమోదుకు ప్రత్యేక పుస్తకం

హనుమకొండ పాలనాధికారి ప్రావిణ్య వినూత్నంగా ఆలోచించి ఏటీఆర్ (యాక్షన్ టేకెన్ రిపోర్ట్) బుక్ ఏర్పాటు చేశారు. ఎవరైనా కలెక్టర్‌కు నేరుగా దరఖాస్తు ఇచ్చినా, తాను క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లినప్పుడు అక్కడ ఉన్న సమస్యలేమిటో ఆరా తీస్తున్నారు. వాటిని పరిష్కరించేందుకు ఏం చేయాలి.. తన పరిధిలో చేయొచ్చా..పై అధికారులతో మాట్లాడాల్సి వస్తుందా... ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేలా.. ఇలా ప్రతి పనికి సంబంధించి పూర్తి వివరాలతో కలెక్టరేట్‌లో ఏటీఆర్ బుక్‌లో నమోదు చేసి ఆన్ లైన్ చేయిస్తున్నారు. ప్రతి శనివారం సంబంధిత అధికారులతో సమీక్షిస్తున్నారు. ఫలితంగా ఆయా పనులు పరిష్కారం దిశగా సాగుతున్నాయి. ● ఏటీఆర్‌లో నమోదైన సమస్యలపై సమీక్షిస్తూ పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాని పాలనాధికారి ప్రావిణ్య పేర్కొన్నారు. –న్యూస్‌టుడే, హనుమకొండ కలెక్టరేట్

వాట్సప్ హాజరు గ్రూపులతో గైర్హాజరుకు ముకుతాడు



ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది సకాలంలో హాజరు కావడం లేదని **జనగామ పాలనాధికారి రిజ్వాన్ బాషా** ఆకస్మిక తనిఖీల్లో వెల్లడైంది. దీంతో ఆయన తనతో పాటు డీఎంహెచ్ఓ, ఇతర వైద్యాధికారులు, అన్ని పీహెచ్‌సీల వైద్యులు, అన్ని విభాగాల సిబ్బందితో ఒక వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేశారు. పీహెచ్‌సీ సీహెచ్‌సీల్లో ప్రతి రోజూ విధులకు హాజరయ్యే వైద్య, సిబ్బంది విధుల్లోకి వచ్చిన, వెళ్తున్న సమయంలో ఆ గ్రూప్‌లో ఫొటో పోస్టు చేసేలా చర్యలు చేపట్టారు. ఆ రోజు ఎంత మందికి ఓపీ చూశారు, ఎంత మంది ఇన్‌పేషెంట్లకు వైద్యం చేశారనే వివరాలను పొందుపరుస్తున్నారు. ఈ గ్రూప్‌ను డీఎంహెచ్‌వో రవీందర్ గౌడ్ పర్యవేక్షిస్తుంటారు. పాలనాధికారి కూడా ప్రతి రోజూ పీహెచ్‌సీల వారీగా పరిశీలిస్తూ తన అభిప్రాయాలను పోస్టు చేస్తున్నారు. పాలనాధికారే గ్రూప్‌లో ఉంటూ గమనిస్తుండటంతో అన్ని ఆరోగ్య కేంద్రాల్లో వైద్య, సిబ్బంది మెరుగైన హాజరు కనిపిస్తోంది.




విధుల్లో ఉన్నామంటూ వాట్సప్ గ్రూపులో వివరాలు నమోదు చేస్తున్న వైద్య సిబ్బంది

పాఠశాలల్లో సైతం: జులైలో 600 మంది ఉపాధ్యాయులు సెలవులు పెట్టారని తెలుసుకున్న పాలనాధికారి విద్యాశాఖలోనూ ప్రక్షాళన ప్రారంభించారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేయించారు. రోజూ హాజరు శాతం పోస్టు చేసేలా చర్యలు చేపట్టారు.

● రాష్ట్రంలో జనగామను ఆదర్శ జిల్లాగా ముందు వరుసలో ఉంచాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నామని పాలనాధికారి రిజ్వాన్ బాషా తెలిపారు.

–న్యూస్‌టుడే, జనగామ టౌన్

కంటెయినర్ ఆసుపత్రితో చేరువైన వైద్యం, విద్య



ములుగు జిల్లాలోని ఏజెన్సీ గ్రామాల ప్రజలు సరైన రహదారి లేక అవస్థలు పడుతుంటారు. వర్షాకాలం విద్య, వైద్యం అందని పరిస్థితులు. **ములుగు పాలనాధికారిగా టీఎస్ దివాకర** జూన్‌లో బాధ్యతలు తీసుకున్నారు. మంత్రి సీతక్క ఇక్కడి సమస్యలకు పరిష్కార మార్గం చూపాలని ఆయన్ను కోరారు. ఆయన జిల్లాలోని పలు ప్రాంతాలను సందర్శించి కంటెయినర్ ఆసుపత్రి ఆలోచనను మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లారు. ఆమె సూచనలతో తాడ్వాయి మండలం పోచాపూర్ గ్రామంలో కంటెయినర్ ఎక్స్‌టెన్షన్ కౌంటర్(కంటెయినర్ ఆసుపత్రి) ఏర్పాటు చేయించారు. నర్సాపూర్, అల్లిగూడెం, బందాల, బొల్లెపల్లి గ్రామాలకు కూడా దీని ద్వారా వైద్యసేవలు అందిస్తున్నారు. వాజేడు మండలం ఎడ్జర్లపల్లిలోనూ ఏర్పాటు చేయించారు. రూ.7 లక్షలు వెచ్చించి తయారు చేయించారు. ఇందులో నాలుగు పడకలు ఉంటాయి. ఏఎన్ఎం, ఆశా కార్యకర్త, హెల్త్ అసిస్టెంటు వైద్య సేవలందిస్తున్నారు.

ఇదే స్ఫూర్తితో పాఠశాల..: కన్నాయిగూడెం మండలం బంగారుపల్లి గొత్తికోయ గూడెంలో రూ.13 లక్షలతో పాఠశాల కోసం కంటెయినర్‌ను ఏర్పాటు చేశారు. సోలార్ విద్యుత్తు, డ్యూయెల్ డెస్కులు, ఫ్యాన్లు, నల్లబోర్డు, తదితర వసతులున్నాయి.



కంటెయినర్ బడిలో చదువుకుంటున్న విద్యార్థులు

● రవాణా సౌకర్యం లేని గ్రామాల్లో సమస్యల శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తున్నామని పాలనాధికారి దివాకర తెలిపారు.

–ఈనాడు, జయశంకర్ భూపాలపల్లి

కొడుకు జన్మదిన వేడుకలు చూడకుండానే తండ్రి మృతి

● యువ రైతును కబళించిన విద్యుత్తు తీగలు



కుమార్ (పాత చిత్రం)

న్యూస్‌టుడే, పర్వతగిరి: చంటోడా.. పుట్టిన రోజు శుభాకాంక్షలు.. సాయంత్రం అందరినీ పిలిచి వేడుకలు ఘనంగా చేసుకుందాం.. అంటూ కుమారుడికి చెప్పి పొలం బయలుదేరాడు ఆ నాన్న.. తమ్ముడి పుట్టిన రోజు బాగా చేసుకుందాం..త్వరగా రా నాన్నా అంటూ కూతుళ్లు అడిగితే వెంటనే వచ్చేస్తా బిడ్డా అంటూ కాలు బయటపెట్టాడు ఆ తండ్రి. పొలానికి నీళ్లు పెట్టి త్వరగా వద్దామని ఎంతో ఆనందంగా బయలుదేరాడు. ఆ ఆనంద క్షణాలు మది నుంచి తొలగక ముందే విద్యుదాఘాతం రూపంలో ఆ తండ్రిని మృత్యువు కబళించింది. వేడుకలు చేసుకోవాల్సిన ఇంట విషాదం నింపిన ఈ ఘటన వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రైతు బాల్లె కుమార్(39), సునీత దంపతులకు ప్రవళిక, మానస, సుశాంత్ సంతానం. వ్యవసాయం చేసుకునే కుమార్ కల్లెడ శివారులో ఉన్న పంట పొలానికి నీరు పెట్టేందుకు తెల్లవారుజామున వెళ్లాడు. మోటారుకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో తీగలను పరిశీలిస్తుండగా ప్రమాదవశాత్తు అవి తగలడంతో అక్కడికక్కడే మృతి చెందారు. భర్త ఎంతకూ ఇంటికి రాకపోవడంతో సునీత పొలం వద్దకు వెళ్లి చూడగా మృతి చెంది ఉన్న భర్తను చూసి భోరున విలపించింది. చుట్టుపక్కల రైతులు, కూలీలు ఘటన స్థలానికి చేరుకున్నారు. కుమార్ మృతదేహాన్ని ఇంటికి చేర్చగా కూతుళ్లు బావురుమన్నారు. తమ్ముడి పుట్టిన రోజు వేడుకలను సాయంత్రం ఘనంగా చేద్దామంటివి కదా బాపూ.. అంటూ వారు కన్నీరుమున్నీరయ్యారు. కుమారుడు పుట్టిన రోజునాడే ఇంట నిండిన విషాదాన్ని చూసినవారంతా కన్నీరు పెట్టుకున్నారు. అందరితో కలివిడిగా ఉండే కుమార్ మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

మాజీ డిప్యూటీ మేయర్ 'ఎంబాడి' మృతి



శివనగర్, న్యూస్‌టుడే: వరంగల్ పెరుకవాడకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, వరంగల్ నగరపాలక సంస్థ మాజీ డిప్యూటీ మేయర్ ఎంబాడి రవీందర్(62) అనారోగ్యంతో శుక్రవారం తెల్లవారుజామున హైదరాబాద్‌లో మృతిచెందారు. ఆయనకు భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. 1985లో యువజన కాంగ్రెస్‌లో చేరిన ఆయన అంచెలంచెలుగా పార్టీలో ఎదిగారు. 2000 సంవత్సరంలో మొదటిసారి కార్పొరేటర్‌గా ఎన్నికైన ఆయన కాంగ్రెస్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్‌గా పనిచేశారు. 2005 కార్పొరేటర్‌గా గెలిచి బల్దియా డిప్యూటీ మేయర్‌గా పనిచేశారు. 2016లో భారాసలో చేరి కార్పొరేటర్‌గా గెలిచారు. గత కార్పొరేషన్ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌లో చేరిన ఆయన పోటీ చేయలేదు. 2019లో గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పనిచేశారు. గత శాసనసభ ఎన్నికల సమయంలో చురుగ్గా పార్టీ కోసం పనిచేశారు.

పలువురి సంతాపం: ఎంబాడి రవీందర్ మృతి పట్ల పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ రవీందర్ కుమారులను ఫోన్‌లో పరామర్శించారు. రవీందర్ సేవలను గుర్తు చేస్తూ త్వరలోనే వరంగల్ వచ్చి కలుస్తానని అన్నారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, వరద రాజేశ్వర్‌రావు, మాజీ మేయర్ గుండా ప్రకాష్‌రావు, మాజీ ఎమ్మెల్యే, పెరుక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాం భద్రయ్య, మాజీ డిప్యూటీ మేయర్ కక్కెసారయ్య, కేంద్ర ఖాదీ ఇండస్ట్రియల్ బోర్డు మాజీ డైరెక్టర్ ఈగ మల్లేశం, డాక్టర్ హరిరమాదేవి, వరంగల్ అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంకు ఛైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, భాజపా జిల్లా అధ్యక్షుడు గంటరవికుమార్, తదితరులు రవీందర్ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. సాయంత్రం శాంతినగర్ హిందూశ్మశానవాటికలో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. మంత్రి కొండా సురేఖ, మురళీధర్‌రావు వర్గం కార్పొరేటర్లు, నాయకులు రవీందర్ అంత్యక్రియలకు దూరంగా ఉండటం చర్చనీయాంశంగా మారింది.

విద్యార్థులు తినే ఆహారం ఇలాగేనా..!

రాయపర్తి, న్యూస్‌టుడే : గురుకుల పాఠశాల విద్యార్థులకు అందించే ఆహారంపై జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల, తిర్మలాయపల్లిలోని కస్తూర్బా బాలికల పాఠశాల, కళాశాలను శుక్రవారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. గురుకులంలో ఉదయం అల్పాహారం పులిహోర సిద్ధం చేయగా రుచి చూశారు. పోషక విలువలు లేకుండా ఉండడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇద్దరు వంట కార్మికులను తక్షణమే మార్చాలని సూచించారు. పాఠశాలలో పారిశుధ్యం, నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ప్రిన్సిపల్ సరితకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. అనంతరం ఫిర్యాదుల పెట్టెను ఓపెన్ చేశారు. విద్యార్థుల రాసిన సమస్యలను చదివి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో కిషన్, ప్రత్యేకాధికారి కవిత పాల్గొన్నారు.

సంక్షేమం లబ్ధిదారులకు అందేలా చూడండి

వరంగల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న పథకాలు జిల్లాలోని లబ్ధిదారులకు సకాలంలో అందేలా చూడాలని మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్ అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో అమలవుతున్న ఎన్ఆర్ఈజీఎస్, నేషనల్ ఫుడ్ సేఫ్టీ, దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన (డీడీఏవై), అమృత్ 2.0, స్మార్ట్ సిటీ, హృదయ్, 15వ ఆర్థిక సంఘం నిధులు, ఈ-నామ్, శ్యాంప్రసాద్ ముఖర్జీ జాతీయ రూర్బన్ మిషన్ తదితర ప్రభుత్వ పథకాల పురోగతిపై జిల్లా అధికారులతో ఎంపీ కూలంకుషంగా చర్చించారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ వంద రోజుల పనిదినాలు కల్పించాలన్నారు. జిల్లాలో అంగన్‌వాడీ సిబ్బంది, రేషన్ డీలర్ల ఖాళీలను త్వరితగతిన భర్తీ చేయాలని ఆదేశించారు. రేషన్ బియ్యాన్ని అక్రమ రవాణా చేస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదుచేయాలన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ పోరిక బలరాం నాయక్, చిత్రంలో మేయర్ గుండు సుధారాణి, పాలనాధికారి డా.సత్యశారద, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్వినీతానాజీ

గునపాలు తీసుకొచ్చి సరిచేస్తాం..

తొలుత జిల్లాలో శాఖల వారీగా అమలవుతున్న పథకాలను అధికారులు నివేదించారు. జిల్లాలో గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు చేపట్టిన కార్యక్రమాలు వివరిస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చుచేసినా.. ప్రజలకు తాగునీరు సక్రమంగా అందడం లేదంటూ నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్య ఎక్కడుందో చెబితే.. కలెక్టర్, ప్రజాప్రతినిధులు కలిసి పారలు, గునపాలు తీసుకొచ్చి పైపులైన్లు సరిచేస్తామని వ్యాఖ్యానించారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా.వెంకటరమణ జిల్లాలో వ్యాధుల నియంత్రణపై తీసుకుంటున్న చర్యలను వివరిస్తుండగా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాంతీయ ఆసుపత్రుల్లో ప్రతి రోజు ఔట్‌పేషెంట్ వివరాలు రిజిస్టర్‌లో ఎందుకు నమోదుచేయడంలేదని మాధవరెడ్డి ప్రశ్నించారు. ప్రైవేటుతో పోలిస్తే.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందుతున్నా.. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ప్రజలు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులపై వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు పాఠశాలలకు ఏవిధంగా దోహదపడుతున్నాయో చెప్పాలని ఎంపీ బలరాం నాయక్ అడగ్గా కొద్దిరోజులుగా.. ఉపాధ్యాయ నియామకాల్లో ఉండటం వల్ల నివేదిక తయారీలో దృష్టిసారించలేదని డీఈవో చెప్పారు.

రూ.944.67 కోట్లతో.. 108 అభివృద్ధి పనులు

స్మార్ట్ సిటీ పథకం కింద నగరంలో రూ.944.67 వ్యయంతో 108 అభివృద్ధి పనులను చేపట్టగా అందులో 49 పూర్తయ్యాయని మిగతా 59 పురోగతిలో ఉన్నట్లు మేయర్ గుండు సుధారాణి వెల్లడించారు. కలెక్టర్ డా.సత్యశారద మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో అమలవుతున్న పనుల పురోగతిలో ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్వినీతానాజీ తదితరులు పాల్గొన్నారు.

పచ్చరంగు నీళ్లతో పరేషాన్



తాగునీటి శుద్ధీకరణలో బల్దియా ఇంజినీర్ల అశ్రద్ధ వహిస్తున్నారు. స్వచ్ఛమైన తాగునీటి సరఫరాలో విఫలమవుతున్నారు. వరంగల్ దేశాయిపేట ఫిల్టర్‌బెడ్ జోన్ పరిధిలోని పలు కాలనీల్లో నల్లాల ద్వారా పచ్చరంగు నీళ్లు రావడంతో స్థానిక ప్రజలు పరేషానవుతున్నారు. వారం రోజులుగా బొందలకుంట, మట్టెవాడ, మండిబజారు, నిజాంపురా, వేణురావు కాలనీల్లో పచ్చ రంగునీళ్లు సరఫరా అవుతున్నాయని స్థానిక ప్రజలు వాపోయారు. ఈ నీళ్లను ఎలా తాగాలా అని భయపడుతున్నారు. పోచమ్మమైదాన్ కూడలి, నిజాంపురాలో పైపులైన్ లీకేజీలతో కలుషితమైన తాగునీరు సరఫరా అవుతోందంటున్నారు. –కార్పొరేషన్, న్యూస్‌టుడే

ఘన వ్యర్థాల నిర్వహణ ఎలా?

కార్పొరేషన్, న్యూస్‌టుడే: 'చెత్త శుద్ధీకరణపై గ్రేటర్ వరంగల్ సీరియస్‌గా దృష్టి సారించింది. నగరంలో రోజూ 500 టన్నుల చెత్త వస్తుండగా, ఇందులో 20-30 శాతం శుద్ధి చేయడం లేదు. రాంపూర్ డంపింగ్ యార్డు స్థలమంతా నిండిపోతోంది. ఈ నేపథ్యంలో చెత్త చింతన తొలగించేందుకు బయోమైనింగ్ ప్రాజెక్టుతో పాటు మరి కొన్ని ప్రాజెక్టులు అమలు చేసేందుకు బల్దియా నిశ్చయించింది. ఇందులో భాగంగా శనివారం వరంగల్‌లోని వేంకటేశ్వర గార్డెన్‌లో ఘన వ్యర్థాల నిర్వహణ(సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంటు) సదస్సు ఏర్పాటు చేశారు. అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజి ఆఫ్ ఇండియా(ఆస్కి) సహకారంతో ఘన వ్యర్థాల నిర్వహణపై వ్యాపార, వాణిజ్య వర్గాలకు అవగాహన కార్యక్రమం జరగనుంది.



ఉర్సు రంగలీల మైదానంలో చెత్త

హోటళ్లు, ప్రభుత్వ, ప్రైవేటు హాస్టళ్లు, అపార్టుమెంట్లు, ఫంక్షన్ హాళ్లు తదితరాలకు చెందిన 500 మంది ప్రతినిధులను ఆహ్వానించారు. బెంగళూరు, చైన్నై, హైదరాబాద్‌కు చెందిన 10 ప్రైవేటు కంపెనీల ప్రతినిధులు హాజరు కానున్నారు. ఘన వ్యర్థాల నిర్వహణ ఎలా చేయాలి? ఆధునిక, శాస్త్రీయ పద్ధతులపై దృశ్య రూప ప్రదర్శనలు ఇవ్వనున్నారు.


తడి చెత్తతోనే సమస్య..

● నగరంలోని 66 డివిజన్ల నుంచి ప్రతి రోజూ 480- 500 టన్నుల చెత్త వస్తోంది. అందులో తడి చెత్త అత్యధికంగా 380-390 టన్నులు ఉంటోంది.

● తడి చెత్తలో ఎక్కువ శాతం మిగిలిపోయిన ఆహార పదార్థాలు, పాడైన కూరగాయలు ఎక్కువగా వస్తున్నాయి. ఇలాంటి వాటిని శుద్ధిపరిచేందుకు ఆధునిక విధానాలపై ప్రైవేటు సంస్థల సహకారం తీసుకోవాలని నగరపాలక సంస్థ నిర్ణయం తీసుకుంది.

● హాస్టళ్లు, హోటళ్లు, బిర్యానీ పాయింట్లు, ఫంక్షన్‌హాళ్లు, ఇతర తినుబండారాలు విక్రయించే వ్యాపార సంస్థలకు తడి, పొడి చెత్త వేరు చేయడంపై అవగాహన కల్పిస్తారు మిగిలిన ఆహార పదార్థాలు బయట పడేయకుండా ఆధునిక, శాస్త్రీయ పద్ధతుల్లో పునర్వినియోగానికి ప్రణాళిక తయారుచేస్తారు. స్మార్ట్‌సిటీ పథకం నిధులతో ఘనవ్యర్థాల నిర్వహణ అమలు చేసేందుకు నిర్ణయించారు.

రామప్ప.. సకల కళల సమ్మేళనం..!



వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ శిక్షణలో కొత్త ఆలోచనలకు స్వాగతం

యునెస్కో గుర్తింపు పొందిన కట్టడాల ప్రాముఖ్యాన్ని ప్రపంచస్థాయిలో మరింత ప్రచారం చేయడానికి యునెస్కో.. ఏటా వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ శిక్షణ శిబిరాలను నిర్వహిస్తోంది. ఈనెల 15 నుంచి 26 వరకు 12 రోజుల పాటు రామప్పలో జరుగుతోంది. ఈ కార్యక్రమ నిర్వహణకు మే నెలలోనే దరఖాస్తులు స్వీకరించింది. 243 మంది దరఖాస్తు చేసుకోగా.. 40 మందిని ఎంపిక చేసింది. వీరితో పాటు యువ టూరిజం పేరుతో ఈ శిబిరానికి మరో 40 మందికి ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి అవకాశం కల్పించింది. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వాలంటీర్లతో మాట్లాడి 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం..

–వెంకటాపూర్, న్యూస్‌టుడే

మనకు గర్వకారణం..

రామప్ప ఆలయం.. 800 ఏళ్ల చరిత్ర. ఎన్నో ప్రకృతి విపత్తులను ఎదుర్కొని యునెస్కో గుర్తింపు పొంది ఓరుగల్లుకు గర్వకారణంగా నిలిచింది. ములుగు జిల్లా వెంకటాపూర్ మండల పరిధిలోని ఈ రాతి కట్టడం నిర్మాణశైలి నేటి తరానికి ఎన్నో ఆలోచనలను రేకెత్తిస్తోంది. అయోధ్య రామమందిర పునాదిలో రామప్ప సాండ్‌బాక్సు టెక్నాలజీ వాడారంటే ఆనాటి సాంకేతిక పరిజ్ఞానం ఎంత గొప్పదో తెలుస్తోంది..


శిక్షణ బృందం

కేరళ..

సామాజిక మాధ్యమాల్లో తెలుసుకుని..



కేరళ యూనివర్సిటీ ఆర్కియాలజీ విభాగంలో పీహెచ్‌డీ చేస్తున్న సంజయ్ మూడేళ్ల నుంచి కాలభైరవునిపై పరిశోధన చేస్తున్నారు. భారత దేశంలో ఉన్న ఆలయాలను స్వయంగా వెళ్లి చూడటం.. వాటి ప్రత్యేకతలు తెలుసుకోవడం ఆయనకు అభిలాష. సంజయ్ సందర్శించిన ఆలయాలు చాలావరకు శిథిలావస్థకు చేరుకున్నవి కూడా ఉన్నాయి. వందల ఏళ్లుగా చెక్కుచెదరకుండా ఉండి, ఆనాడే అద్భుత సాంకేతికతను వాడడం, తెలుగు రాష్ట్రాల నుంచి యునెస్కో గుర్తింపు పొందిన ఏకైక కట్టడం రామప్ప అని సామాజిక మాధ్యమాల్లో తెలుసుకున్నారు. వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ శిక్షణకు దరఖాస్తు చేసుకుని ఎంపికయ్యారు.

- రామప్పకు చేరుకోగానే శిలాశాసనం, చరిత్ర గురించి ఆరా తీశారు. ఆయన పరిశీలించిన ఆలయాల్లో రామప్పకు గొప్ప ప్రత్యేకత ఉందని, వాడిన సాంకేతిక పరిజ్ఞానం మరెన్నో కట్టడాల పునర్నిర్మాణానికి ఉపయోగకరంగా ఉందని ఇతరులకు తెలియజేయడానికి నిత్యం సామాజిక మాధ్యమాల ద్వారా చర్చిస్తున్నారు.

తమిళనాడు

సదస్సులకు వెళ్తూ.. స్వయంగా పరిశీలిస్తూ




టీఎన్ఎస్ డీఏ పీజీ డిప్లొమాలో ఇంజినీరింగ్ చేస్తున్న విజయరాజ్‌ది తమిళనాడు. దేశవ్యాప్తంగా వారసత్వ కట్టడాలకు సంబంధించిన సదస్సులకు హాజరవ్వడం మక్కువ. ఫేస్‌బుక్‌లో చూసిన పోస్టును ఆధారం చేస్తుకుని వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ శిక్షణ శిబిరం-3కి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. కాకతీయ హెరిటేజ్ ట్రస్టు సభ్యుడు ప్రొఫెసర్ పాండురంగారావు సూచనల మేరకు తమిళనాడు నుంచి తన నలుగురు మిత్రులతో కలిసి రామప్పకు వచ్చారు.

- కాకతీయులు నిర్మించిన ఆలయాల ప్రత్యేకత గురించి శిబిరంలో నేర్చుకుంటున్నారు. ప్రొఫెసర్లు వివరించే తీరు, ప్రత్యక్షంగా చూపించే పద్ధతి ఎంతో ఉపయోగకరంగా ఉందంటూ చెప్పారు. శిక్షణలో కొత్త ఆలోచనలు పంచుకుంటున్నారు.

ఆంధ్రప్రదేశ్

ప్రకృతి ప్రతిరూపమే.. పర్యాటకం



ప్రకృతి రూపమైన పర్యాటకాన్ని ప్రపంచ నలుమూలలా చాటేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నంద్యాలకు చెందిన జ్ఞానకళ బీబీఏ టూరిజం విభాగంలో పరిశోధనలు చేస్తున్నారు. లెజర్ టూరిజం, అడ్వెంచర్, ఫుడ్స్, గుళ్లగోపురాలకు సంబంధించిన పర్యాటక మెలకువలను నేర్చుకోవడానికి ప్రయత్నాలు మొదలు పెట్టారు.

- పర్యాటక ప్రదేశాలకు వెళ్లిరావడం కాదని, అక్కడ చూసిన, తెలుసుకున్న విషయాలపై అవగాహన పెంచుకొని పలువురికి తెలియజేయాలని వాట్సాప్, ఫేస్‌బుక్ వేదికలుగా వేలాది మందికి అవగాహన కల్పిస్తున్నారు. శిబిరంలో ఏర్పాటు చేసిన బృందాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. రామప్ప అద్భుత శిల్పాల గురించి ప్రపంచవ్యాప్తంగా తెలియజేయడంలో తన వంతు పాత్ర పోషిస్తున్నారు..

తెలంగాణ

టూరిజం క్లబ్‌లో స్థానం దక్కించుకుని..



చరిత్రను అభ్యసించేవారు తగ్గిపోతున్న ఈ రోజుల్లో వరంగల్ పింగిళి కళాశాల హిస్టరీ ప్రొఫెసర్ శ్రీనివాస్ ప్రోత్సాహంతో స్వప్న బీఏ(చరిత్ర) చదువుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన టూరిజం క్లబ్(యువటూరిజం)లో స్థానం దక్కించుకుని వాలంటీర్ శిక్షణకు ఎంపికయ్యారు.

- కాకతీయ కట్టడాల చరిత్ర అంటే అంతా ఒకేలా ఉంటుందని అనుకున్న ఆమె రామప్పకు చేరుకున్న తర్వాత ఆలయంలోని రాగిని, నాగిని శిల్పాలు, పొన్న చెట్టుపై ఉన్న శ్రీకృష్ణుడు సత్యభామ చీర లాగడం, శిల్పాలను మీటితే సరిగమపదనిసలు రావడం, క్షీరసాగరమథనం, శివపార్వతుల కళ్యాణం, నరకాసురవధ లాంటి పురాణ హితిహాసగాథలు, భూకంపాలను తట్టుకునే విధంగా కట్టిన ఆలయ నిర్మాణాన్ని చూసి అబ్బురపడిపోయారు. దేశంలోని చరిత్రలకే కాకతీయుల చరిత్ర పునాదిగా నిలిచిందంటున్నారు.


హనుమకొండ జిల్లాలోని ఓ క్వారీలో తవ్వకాలు

ఇక్కడా ఉన్నారు ఘనులు

● కరుగుతున్న గుట్టలు.. తరలుతున్న మొరం

గనుల మేతలో ఆరితేరిన లీజుదారులకు అధికారులు వత్తాసు పలుకుతున్నారు. ఉమ్మడి వరంగల్‌వ్యాప్తంగా నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారీతిన తవ్వకాలు జరుగుతున్నాయి. జనగామ జిల్లా మైనింగ్ శాఖ ఏడీ విజయ్‌కుమార్ ఇటీవల సస్పెండ్ అయ్యారు.. ఆయన మహబూబ్‌నగర్ జిల్లాలో పనిచేసినప్పుడు స్థిరాస్తి వ్యాపారులకు సహకరించి అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలపై విచారణ జరిపి ప్రభుత్వం ఆమేరకు నిర్ణయం తీసుకుంది.. ఉమ్మడి జిల్లాలోనూ గ్రానైట్, మట్టి తవ్వకాల్లో రూ.కోట్లల్లో అక్రమాలు జరిగింది. ఇక్కడ సైతం పూర్తిస్థాయిలో విచారణ చేపడితే అవినీతి అధికారులపై వేటు పడే అవకాశం ఉంది.

–ఐనవోలు (హనుమకొండ), న్యూస్‌టుడే

'ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా గనుల తవ్వకాల కోసం అనుమతులు పొందినవి 1,276 కాగా, అక్రమంగా తవ్వకాలు చేపట్టేవి 430కి పైగా ఉన్నట్లు గుర్తించారు.'

'వరంగల్ గ్రానైట్‌ను దేశంలో అనేక రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. క్వారీల నుంచి బ్లాక్, టాన్ బ్రౌన్, టాన్ రెడ్, టాన్ బ్లూ గ్రానైట్ అధికంగా లభిస్తుంది.'

టాస్క్‌ఫోర్స్

ప్రభుత్వ ఆదేశాలతో విచారణ జరిపిన అధికారులు గనుల తవ్వకాల్లో భారీగా సీనరేజి ఎగవేత జరిగిందని గుర్తించారు. జనవరి, ఫిబ్రవరి నెలల్లో లీజుదారులకు నోటీసులు జారీ చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో సైతం 80 మందికిపైగా లీజుదారులకు నోటీసులు అందజేసి జరిమానా విధించారు. దీంతో కొంతమంది క్వారీలు మూసివేశారు.

పంట పొలాలు.. వెంచర్లుగా: స్థిరాస్తి వ్యాపారం సజావుగా కొనసాగాలంటే అనుమతులతో పాటు భూమి చదునుగా ఉండటం ముఖ్యం. ఇందుకు ప్రధానంగా మొరం అత్యంత అవసరం. గ్రేటర్ వరంగల్ నగరం చుట్టూ ధర్మసాగర్, ఆత్మకూరు, ఐనవోలు, దామెర, హసన్‌పర్తి మండలాల్లో 109 గ్రానైట్, మొరం క్వారీలు ఉన్నాయి. ఇందులోని మొరాన్ని స్థిరాస్తి వ్యాపారానికి వినియోగిస్తున్నారు. అధికారులు ఇచ్చే అరకొర అనుమతులతో గ్రానైట్, మట్టి, ఇసుక తవ్వకాల్లో అనుమతులకు భిన్నంగా లీజుదారులు తోడేస్తున్నారు. నగరానికి వేలాది టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారు. అధికారులు, లీజుదారులు, వ్యాపారులు కుమ్మక్కై చేతివాటం చూపడంతో వేలాది వ్యవసాయ భూములు వెంచర్లుగా వెలుస్తున్నాయి.

ఇదీ పరిస్థితి..

- కాజీపేట నుంచి వరంగల్ వెళ్లే బైపాస్ ప్రధాన మార్గం భట్టుపల్లి రెవెన్యూ పరిధిలో రహదారికి ఆనుకొని ఉన్న 18 ఎకరాల భూమి రోడ్డుకు 10 ఫీట్ల లోతులో ఉండేది. ఆ భూమికి ఎదురుగా ఓ కార్పొరేట్ పాఠశాల, కళాశాల ఏర్పాటు చేయగా ఆ ప్రాంత భూముల ధరలకు రెక్కలొచ్చాయి. లోతట్టులో ఉన్న భూమిని రహదారికి సమాంతరంగా చేయాలని ఆ భూమి యజమాని భావించారు. గత పాలకులు, అధికారుల సహకారంతో కొండపర్తి, వనమాలకనపర్తి, తరాలపల్లి క్వారీల నుంచి 4 వేలకుపైగా టిప్పర్ల ద్వారా 80 వేల మెట్రిక్ టన్నుల మొరం తరలించి రోడ్డుకు సమాంతరంగా భూమిని చదును చేశారు.
- హైదరాబాద్ -వరంగల్ జాతీయ ప్రధాన రహదారిలో రాంపూర్ రెవెన్యూ పరిధిలో అనుమతులు తీసుకుని 30 ఎకరాల్లో ఏర్పాటు చేసి ఓ లేఅవుట్, వరంగల్-ఖమ్మం జాతీయ ప్రధాన రహదారిలో పున్నేలు రెవెన్యూ పరిధిలో 25 ఎకరాల్లో ఏర్పాటు చేసిన వెంచర్, దేవన్నపేట, మడిపల్లి రెవెన్యూ పరిధిలో 40 ఎకరాల్లో ఏర్పాటు చేసిన లేఅవుట్ల భూముల్లోకి వేలాది టిప్పర్ల ద్వారా మొరం తరలించారు. మొత్తంగా రూ.8 కోట్లకు పైగా మొరం తరలింపులో అధికారుల పాత్ర ఉందని ఆరోపణలు ఉన్నాయి.

ధర్మసాగర్ మీదుగానే గూడ్స్ లైన్ బైపాస్

● నష్కల్ నుంచి చింతలపల్లికి మరోటి

కాజీపేట, న్యూస్‌టుడే: హసన్‌పర్తి రోడ్డు నుంచి ధర్మసాగర్ మీదుగా నష్కల్ వరకు గూడ్సు బైపాస్ లైను నిర్మాణానికి రైల్వే శాఖ అడుగులు వేస్తోంది. తాజాగా ఈ మార్గంలో 24.55 కి.మీటర్ల మేర భూసేకరణకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఇప్పటికే ధర్మసాగర్ రైతులు బైపాస్ లైను మార్గం మార్చాలని కోరుతున్నారు. ముందుగా పెండ్యాల నుంచి 163వ జాతీయ రహదారి పక్కనుంచి లైన్‌ను ప్రతిపాదించారు. తర్వాత బైపాస్ మార్గాన్ని మార్చుతూ రైల్వే నిర్ణయం తీసుకుంది. కొందరు పెద్దల ఒత్తిడే దీనికి కారణమంటూ ధర్మసాగర్ రైతులు ఆరోపిస్తున్నా.. రైల్వే శాఖ ధర్మసాగర్ మీదుగానే బైపాస్ నిర్మాణానికి సిద్ధమైంది. భూసేకరణ కోసం జనగామ, హనుమకొండ జిల్లాల్లోని ధర్మసాగర్, హసన్‌పర్తి, చిల్పూర్ రెవెన్యూ అధికారులకు నోటిఫికేషన్ అందించింది. దీంతో పాటు నష్కల్ నుంచి మామునూరు మీదుగా గీసుకొండ మండలం చింతల్ రైల్వే స్టేషన్ వరకు మరో బైపాస్‌ను ప్రతిపాదించింది. గూడ్సురైళ్లను బైపాస్‌ల మీదుగా పంపించి కాజీపేట, వరంగల్ స్టేషన్లలో ప్రయాణికుల రైళ్ల రాకపోకలకు సుగమం చేయడానికి ఈ రెండు మార్గాలను ప్రతిపాదించింది. బల్లార్షా- కాజీపేట మార్గంలో గూడ్సు రైళ్ల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతుండటం వల్ల ఈ మార్గంలో ముందస్తుగా నిర్మాణం చేయాలని భావిస్తోంది.

వంతెన నిర్మాణానికి ప్రణాళిక.. : హసన్‌పర్తి రోడ్డు - నష్కల్ స్టేషన్ల మధ్య నిర్మించే బైపాస్ లైన్ నష్కల్ లేదా పెండ్యాల వద్ద 163వ జాతీయ రహదారిని క్రాస్ చేయాల్సి ఉంటుంది. అలాగే బైపాస్ వల్ల ఎక్కువగా ధర్మసాగర్ గ్రామస్థులు, రైతులకు ఇబ్బంది కలిగే అవకాశం ఉంది. అందుకని ఈ రెండు చోట్ల వంతెనల నిర్మాణం కోసం రైల్వే అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు.



రైల్వే శాఖ విడుదల చేసిన రూట్‌మ్యాప్

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్	
ఫాం:	120
రిటైల్:	142
డ్రెస్డ్:	206
స్కిన్‌లెస్:	234

అవివాహితులకు సువర్ణావకాశం

నేడు, రేపు అన్ని కులాల వధూవరులకు 'ఈనాడు' పెళ్లిపందిరి. నెట్ ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం



జనగామ, న్యూస్‌టుడే: తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన 'ఈనాడు' పెళ్లిపందిరి.నెట్ అన్ని కులాల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. జనగామలోని శ్రీచెన్నకేశవ స్వామి దేవాలయం వేదికగా ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. వివాహం కోసం ఎదురు చూస్తున్న వధూవరులతో పాటు, సంబంధిత కుటుంబీకులు నేడు అనగా శనివారం(19 అక్టోబరు 2024) మరియు ఆదివారం (20 అక్టోబరు 2024) నాడు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలిచిన వధూవరుల బయోడేటా, ఫొటోలు దిగువన పేర్కొన్న వాట్సప్ ఫోన్ నెంబర్లకు పంపవచ్చు. మరిన్ని వివరాలకు 8314445190, 8008002165 ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చు.



సమస్యలు బోలెడు.. కొత్త వీసీపై ఆశలు

కాకతీయ విశ్వవిద్యాలయం ఉప కులపతిగా నియమితులైన విశ్రాంత ఆచార్యులు కర్నాటి ప్రతాప్‌రెడ్డికి ఇక్కడి సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. ఇటు విద్యార్థులు, అటు ఆచార్యులు, అధ్యాపకులు ఆయనపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారంపై ప్రధానంగా దృష్టి సారించాలని కోరుతున్నారు.

విద్యానగర్, కేయూ క్యాంపస్, న్యూస్‌టుడే

వేతనాలకే చాలని నిధులు..

ఉత్తర తెలంగాణలో విద్యా కేంద్రంగా విరాజిల్లుతున్న కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతోంది. ఇక్కడ పని చేస్తున్న వెయ్యి మంది బోధన, బోధనేతర సిబ్బంది వేతనాలకు ఏడాదికి రూ.150 కోట్లు అవసరం. రాష్ట్ర ప్రభుత్వం నుంచి బ్లాక్ గ్రాంట్ కింద వస్తున్న రూ.97 కోట్లు వేతనాలకు సరిపోక.. ఏటా రూ.53 కోట్ల నిధులు అంతర్గత సమీకరణల ద్వారా సమకూర్చుకుంటున్నారు. నిధులు లేక అభివృద్ధి అటకెక్కింది. తక్షణం నిధుల సేకరణపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

వేధిస్తున్న అధ్యాపకుల కొరత..

విశ్వవిద్యాలయంలో బోధన, పరిశోధనలను ప్రగతి పథంలో పరుగులు పెట్టించాలంటే అధ్యాపకుల పాత్ర ఎంతో కీలకం. వర్సిటీలో ప్రస్తుతం బోధన అంతా ఒప్పంద, తాత్కాలిక అధ్యాపకులతోనే సాగిస్తున్నారు. మొత్తం 405 రెగ్యులర్ అధ్యాపక పోస్టులు ఉండగా.. అందులో 83 మంది మాత్రమే పని చేస్తున్నారు. మరో 190 మంది ఒప్పంద, 201 మంది తాత్కాలిక అధ్యాపకులు బోధిస్తున్నారు. కొత్తగా ప్రవేశ పెట్టిన కోర్సులతో కలిపి సుమారు వెయ్యి మంది వరకు అధ్యాపకులు ఉండాలి. వారి నియామకాలే పెద్ద సమస్యగా మారింది.


నిధులు లేక నిరుపయోగంగా ఉన్న కె-హబ్

మరిన్ని..

- విశ్వవిద్యాలయంలో మొత్తం 14 వసతి గృహాలు ఉన్నాయి. వీటిలో బాలురకు సరిపడా ఉన్నా.. బాలికలకు వసతి కొరత ఉంది.
- కబ్జాకు గురైన కేయూ భూములను స్వాధీనం చేసుకోవడంపై దృష్టి పెట్టాలి. మిగతా స్థలాలు ఆక్రమణకు గురికాకుండా ప్రహరీ నిర్మాణం అవసరం.
- పీహెచ్‌డీ ప్రవేశాలపై కొనసాగుతున్న వివాదం

15వ ఉప కులపతిగా కర్నాటి ప్రతాప్‌రెడ్డి



విద్యానగర్, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయం 15వ ఉప కులపతిగా కర్నాటి ప్రతాప్‌రెడ్డి రానున్నారు. ఆయనకు 32 సంవత్సరాలకు పైగా బోధన, 37 సంవత్సరాల పరిశోధన అనుభవం ఉంది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో సైన్స్ డీన్‌గా పనిచేసి 2021లో ఉద్యోగ విరమణ పొందారు. కాకతీయ విశ్వవిద్యాలయానికి వ్యక్తిపరంగా 13వ, పదవీ కాలం పరంగా చూస్తే 15వ ఉప కులపతి అవుతున్నారు. గతంలో ఆచార్య జాఫర్ నిజాం, ఆచార్య టి.వాసుదేవ్ రెండుసార్లు వీసీగా పని చేశారు. ఆచార్య టి.రమేశ్ పదవీ కాలం ఈ ఏడాది మార్చి 21న ముగిశాక ఇప్పుడు రెగ్యులర్ వీసీ నియామకం అయ్యారు.

ఇదీ ప్రస్థానం

- కర్నాటి ప్రతాప్‌రెడ్డిది రంగారెడ్డి జిల్లా యాచారం. 1981లో బీఎస్సీ (హానర్స్) జంతుశాస్త్రంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ పట్టా పొందారు. అదే విశ్వవిద్యాలయం నుంచి 1983లో జంతుశాస్త్రం, న్యూరోబయాలజీ నుంచి పీజీ పట్టా తీసుకున్నారు. 1988లో జంతుశాస్త్రం, న్యూరోబయాలజీ లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. ఉద్యోగ జీవితంలో ఎన్నో బాధ్యతలు నిర్వర్తించారు.. ముఖ్యంగా
- 2016 నుంచి 2018 వరకు జంతుశాస్త్ర విభాగాధిపతిగా, 2018 నుంచి 2020 వరకు విశ్వవిద్యాలయ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా, 2020 నుంచి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో సైన్స్ డీన్‌గా సమర్థంగా పనిచేశారు. 2021లో ఉద్యోగ విరమణ చేశారు. తన ఉద్యోగ ప్రస్థానంలో 104 జాతీయ, అంతర్జాతీయ పరిశోధన పత్రాలు ప్రచురించారు. 87 జాతీయ, అంతర్జాతీయ పరిశోధన, ప్రదర్శనలు చేశారు. 10 ప్రాజెక్టులు పూర్తి చేశారు. 7 పుస్తకాలను రచించారు. 25 మందికి పరిశోధన పర్యవేక్షకుడిగా పని చేశారు.


కృష్ణా కాలనీ పాఠశాలలో పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు


విజేతలతో ఉపాధ్యాయులు


నర్సంపేట జడ్పీఎస్ఎస్ మోడల్ పాఠశాలలో ..


బహుమతులు పొందిన విద్యార్థులతో ప్రధానోపాధ్యాయిని శాంతకుమారి, ఉపాధ్యాయులు

ప్రతిభ చాటారు.. విజేతలయ్యారు!

గిర్మాజీపేట, న్యూస్‌టుడే: వరంగల్ స్టేషన్ రోడ్డులోని కృష్ణా కాలనీ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచారు. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు', 'విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశాలపై శుక్రవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పదో తరగతి విద్యార్థి బి.విష్ణువర్ధన్ సింగ్ ప్రథమ, ఎం.నందిని రెండో స్థానం, తొమ్మిదో తరగతి విద్యార్థిని సి.హెచ్.రమ్యశ్రీ మూడో స్థానంలో నిలిచారు. వారికి పాఠశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కె.సందీప్‌కుమార్, మస్నా వెంకటేశ్వర్లు తదితర ఉపాధ్యాయులు బహుమతులు, ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు.

నర్సంపేట, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు పోటీలు దోహదపడతాయని నర్సంపేట జడ్పీఎస్ఎస్ మోడల్ పాఠశాల ప్రధానోపాధ్యాయిని శాంతకుమారి అన్నారు. అంతర్జాలం వినియోగంతో లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమం ప్రభావం అనే అంశంపై శుక్రవారం స్థానిక జడ్పీఎస్ఎస్ మోడల్ పాఠశాలలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు 'ఈనాడు-ఈటీవీ తెలంగాణ' ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అంతర్జాల వినియోగం పెరిగిందని, దానిపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పదో తరగతి విద్యార్థులు పి.సాత్విక, బి.వెంకన్న, 9వ తరగతి విద్యార్థి ఇసాక్ లివింగ్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ప్రధానోపాధ్యాయిని శాంతకుమారి చేతుల మీదుగా వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మురళి, సురేందర్, కుమారస్వామి, శ్యాంప్రసాద్, విజేందర్, శోభన్, రవి తదితరులు పాల్గొన్నారు.

గుంతలను పూడ్పించిన ట్రాఫిక్ సీఐ



శివనగర్, న్యూస్‌టుడే: వరంగల్ అండర్‌బ్రిడ్జి జీపు అడ్డా వద్ద ప్రధాన రోడ్డుపై పడిన గుంతలతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్న విషయాన్ని ట్రాఫిక్ సీఐ రామకృష్ణ దృష్టికి స్థానికులు రాజేష్ ఉపాధ్యాయ, వినోద్‌కుమార్ తీసుకెళ్లగా సీఐ స్పందించారు. శుక్రవారం రెడీ మిక్స్ తెప్పించి గుంతల్లో పోయించారు. కానిస్టేబుళ్లు పారలతో రెడీ మిక్స్‌ను చదును చేశారు. ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు చేయాల్సిన పనిని ట్రాఫిక్ సీఐ రామకృష్ణ చేయించడంపై స్థానికులు, వాహనదారులు కృతజ్ఞతలు తెలిపారు.

మహిళల భాగస్వామ్యంతో జాతీయస్థాయి గుర్తింపు


సదస్సులో మాట్లాడుతున్న బాలిరెడ్డి

గీసుకొండ (సంగెం), న్యూస్‌టుడే: జాతీయ స్థాయి ఉత్తమ పంచాయతీగా మరియపురం ఎంపిక కావడంలో మహిళా సంఘాల సభ్యులు ప్రధాన పాత్ర పోషించారని మాజీ సర్పంచి అల్లం బాలిరెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో ఆగ్రశ్రీ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి సదస్సు రెండో రోజు శుక్రవారం బాలిరెడ్డి పాల్గొని మాట్లాడారు. గ్రామంలో మద్య నిషేధం, ప్లాస్టిక్ నిర్మూలన, పొదుపు రుణాలతో కిరాణ దుకాణాలు, కుట్టుమిషన్లు, ఎంబ్రాయిడరీ మిషన్లు ఇతర వ్యాపార యూనిట్లను ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా ఎదిగినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కర్ణాటక ఆర్థిక సంఘం ఛైర్మన్ నారాయణస్వామి, పంచాయతీ ప్రెసిడెంట్ వెంకట్రావు గొర్పాడ, ఆగ్రశ్రీ డైరెక్టర్ సుందర్‌రామ్ పాల్గొన్నారు.

'హక్కుల సాధనకు ఐక్య ఉద్యమాలు'

రామన్నపేట, న్యూస్‌టుడే: మహిళల ఆర్థిక, రాజకీయ, సామాజిక సమస్యల పరిష్కారానికి, రాజ్యాంగం కల్పించిన హక్కుల సాధనకు ఐక్య ఉద్యమాలే శరణ్యమని ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి నలిగంటి రత్నమాల తెలిపారు. శుక్రవారం రామన్నపేటలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) ఏరియా కమిటీ సమావేశం నల్ల రేణుక అధ్యక్షతన జరిగింది. కేంద్రంలోని భాజపా ప్రభుత్వం మహిళా సాధికారత గొప్పలు చెప్పడం తప్ప ఆచరణలో అమలు చేయడం లేదని రత్నమాల విమర్శించారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లుపై కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. అనంతరం ఐద్వా నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షురాళ్లుగా రంగరాజు విజయ, ఎండీ.షమీమ్, అధ్యక్షురాలిగా నల్ల రేణుక, కార్యదర్శిగా ఎల్.సరిత, కమిటీ సభ్యులుగా సంగీత, హేమలత, రాజక్క, శారద, సక్కుబాయి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం


ధాన్యంలో తేమశాతం చూస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, కలెక్టర్ సత్య శారద

రాయపర్తి, న్యూస్‌టుడే : రైతుల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కాట్రపల్లి, రాయపర్తిలో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న రూ.500 బోనస్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో 13 మందికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. కిష్టాపురం గ్రామానికి చెందిన అన్వేష్, రాజు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో డీఆర్డీవో కౌసల్యదేవి, డీఎంవో సురేఖ, పౌర సరఫరాల శాఖ డీఎం సంధ్యారాణి, డీపీఎం భవాని, డీసీవో నీరజ, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో కిషన్, ఐకేపీ ఏపీఎం కిరణ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు కృషి చేయాలి


వర్ధన్నపేట ఏసీపీ కార్యాలయంలో మొక్కనాటి నీరు పోస్తున్న వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా

వర్ధన్నపేట, న్యూస్‌టుడే: నేరాల నియంత్రణకు పోలీసులు ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. వర్ధన్నపేట ఏసీపీ కార్యాలయాన్ని శుక్రవారం సీపీ తనిఖీ చేశారు. పోలీసుల పనితీరును రికార్డులను పరిశీలించారు. నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. అంతకు ముందు వర్ధన్నపేట ఏసీపీ కార్యాలయంలో ఆయన మొక్కనాటి నీరు పోశారు. కార్యక్రమంలో వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్, వర్ధన్నపేట ఏసీపీ నర్సయ్య, సీఐలు శ్రీనివాసరావు, మహేందర్‌రెడ్డి, ఎస్సైలు రాజు, శ్రావణ్, చందర్, సృజన్, రాంచరణ్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని మహిళా కూలీ మృతి


తిరుపతమ్మ (పాతచిత్రం)

గిర్మాజీపేట, న్యూస్‌టుడే: పట్టాలు దాటుతుండగా.. ప్రమాదవశాత్తు రైలు ఢీకొని ఓ మహిళా కూలీ మృతిచెందిన ఘటన వరంగల్ రైల్వేస్టేషన్ పరిధిలో జరిగింది. ప్రభుత్వ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నెక్కొండ మండలం గొల్లపల్లికి చెందిన కంటే తిరుపతమ్మ (50) ప్రతి రోజు పొలంలో పత్తి ఏరడానికి వెళుతుంటారు. ఈక్రమంలో శుక్రవారం ఉదయం 8.35 గంటలకు రైలు పట్టాలకు అటువైపు ఉన్న పొలానికి వెళ్లేందుకని పట్టాలు దాటుతుండగా.. ప్రమాదవశాత్తు ఆమెను గూడ్సు రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందారు. శవపరీక్ష అనంతరం మృతదేహాన్ని ఆమె భర్త గురువయ్యకు అప్పగించారు.

మానవ అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలి

గిర్మాజీపేట, న్యూస్‌టుడే: మానవ అక్రమ రవాణాపై విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ (ఏహెచ్‌టీయూ) ఇన్‌స్పెక్టర్ పి.వెంకన్న అన్నారు. వరంగల్ స్టేషన్‌రోడ్డులోని కృష్ణాకాలనీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సైబర్ క్రైం, లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు, బాలకార్మికులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపల్ శరద్యుతి, సీడబ్ల్యూసీ సభ్యుడు మధు, ఇన్‌ఛార్జి డీసీపీవో రాజు తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు కళల్లో రాణించాలి


విజేతలతో విద్యాశాఖ అధికారులు, న్యాయ నిర్ణేతలు

వరంగల్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం వరంగల్‌లోని బిర్లా ఓపెన్ మైండ్ పాఠశాలలో జిల్లా స్థాయి 'కళోత్సవ్-24' పోటీలు నిర్వహించారు. మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన 150 మంది విజేతలు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఉండ్రాతి సుజన్‌తేజ హాజరై ప్రారంభించారు. విద్యార్థులు చదువుతో పాటు కళల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. అనంతరం పోటీలు నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని నృత్యాలతో ఆకట్టుకున్నారు. ప్రతిభ కనబరచిన ఆరు బృందాలను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. న్యాయ నిర్ణేతలుగా శ్రీనివాస్, రవి, విజయ, శ్రావణి, రవీందర్, ఈశ్వర్ వ్యవహరించారు. కార్యక్రమంలో జీసీడీవో ఫ్లోరెన్స్, డీసీఈబీ సెక్రటరీ కృష్ణమూర్తి, డీఎస్‌వో శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక


విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

శివనగర్, న్యూస్‌టుడే: పెరుకవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని కీర్తన(7వ తరగతి) ఈనెల 18 నుంచి 22 వరకు వరంగల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్ తెలిపారు. విద్యార్థినిని పలువురు అభినందించారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

సంగెం, న్యూస్‌టుడే: ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందారు. ఎస్సై నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. సంగెం మండలం వీఆర్‌ఎన్ తండాకు చెందిన బానోతు బాలు (42) మద్యానికి బానిసై మారాడు. మద్యం మత్తులో తరచూ భార్యతో గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది ఈ నెల 15న బాలు మద్యం మత్తులో పురుగుమందు తాగాడు. కుటుంబ సభ్యులు ఆయనను ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తండ్రి సుక్యా ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సదానందానికి రాహుల్‌గాంధీ నుంచి ఆహ్వానం


వాల్మీకి చిత్రపటం అందజేస్తున్న సదానందం

గిర్మాజీపేట, న్యూస్‌టుడే: ఆదికవి వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా రాష్ట్రం నుంచి గిర్మాజీపేటకు చెందిన ప్రదేశ్ కాంగ్రెస్ ఎస్సీ సెల్ సభ్యుడు బాసిపాక సదానందానికి కాంగ్రెస్ అగ్రనేత ఎంపీ రాహుల్ గాంధీ నుంచి ఆహ్వానం వచ్చింది. ఈమేరకు గురువారం సాయంత్రం దిల్లీ వెళ్లిన ఆయన రాహుల్‌గాంధీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు వాల్మీకి మహర్షి చిత్రపటాన్ని అందజేశారు.

ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్ పోటీలు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: వరంగల్ జిల్లా ఎస్‌జీఎఫ్ఐ(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) పోటీలు ఉత్సాహంగా జరిగాయి. శుక్రవారం కాశీబుగ్గ ఓసిటీ మైదానంలో వాలీబాల్, కబడ్డీ, ఖో ఖో పోటీలు నిర్వహించారు. అండర్-14 బాలికలకు ఖో ఖో, అండర్-17లో బాలబాలికలకు వాలీబాల్, అండర్-17లో బాలికలకు కబడ్డీ పోటీలు జరిగాయి. ముఖ్యఅతిథిగా వరంగల్ జిల్లా వ్యాయామ విద్య ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్లు హాజరై పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సారంగపాణి, రమేష్, బాబు, రవీందర్, నాగరాజు, శ్రీనివాస్, వివిధ పాఠశాలల పీఈటీలు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల వితరణ

గీసుకొండ (సంగెం), న్యూస్‌టుడే: మండలంలోని బొడ్డు చింతలపల్లి గ్రామానికి చెందిన మాదిరెడ్డి రాకేశ్ రూ.60 వేలు విలువ చేసే 15 సీసీ కెమెరాలను శుక్రవారం పంచాయతీ కార్యదర్శి కళ్యాణికి అందజేశారు. గ్రామంలో నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు సహాయ పడుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు యుగేందర్, హరికృష్ణ, గ్రామస్థులు పాల్గొన్నారు.

చేపల వలకు చిక్కిన కొండచిలువ

సంగెం, న్యూస్‌టుడే: ఎల్గూర్‌రంగంపేటలోని చెరువులో చేపలు పట్టేందుకు మొండ్రాయికి చెందిన మత్స్యకారుడు బయ్య సారంగం శుక్రవారం వల వేయగా మృతిచెందిన కొండచిలువ చిక్కింది. ఇటీవల వరద నీటితో పాటు కొండచిలువలు చెరువులోకి వచ్చాయని, అప్రమత్తంగా ఉండాలని ఎల్గూర్ చెరువు మత్స్యపారిశ్రామిక సంఘం అధ్యక్షుడు భగత్ తెలిపారు.

యువతి ఆత్మహత్యాయత్నం

నర్సంపేట, న్యూస్‌టుడే: పొదుపు సంఘంలో తీసుకున్న అప్పు కింద ద్విచక్రవాహనాన్ని తీసుకెళ్లడంతో అవమానంగా భావించిన యువతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శుక్రవారం రాత్రి నర్సంపేటలో జరిగింది. బాధితురాలి భర్త దారం శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన శేఖర్ భార్య మెర్సీ స్వయం సహాయక సంఘంలో సభ్యురాలు. ఆమెకు మూడేళ్ల క్రితం శ్రీచైతన్య సమాఖ్య ఎస్ఎల్ఎఫ్‌లో రూ.30 వేల రుణం మంజూరుగా కాగా రూ.27 వేలు ఇచ్చారు. నెలకు రూ.2500 చొప్పున రెండున్నరేళ్లగా రుణం చెల్లించారు. ఇంకా రూ.5వేల బాకీ ఉండగా కొన్ని నెలల నుంచి కిస్తీలు చెల్లించలేదు. దీంతో సంఘం సభ్యులు గురువారం మధ్యాహ్నం వారి ఇంటికి వచ్చి వారి ద్విచక్రవాహనాన్ని తీసుకెళ్లారు. ఓ మహిళ తనను కొట్టిందని శేఖర్ ఆరోపించారు. దీనిపై మెర్సీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గురువారం మధ్యాహ్నం సంఘం సభ్యులు ఇష్టారీతిన మాట్లాడడంతో మనస్తాపం చెందిన మెర్సీ ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు యత్నించింది. స్థానికులు ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి పంపించారు. ఈ విషయాన్ని మెప్మా ఏడీఎంసీ వహిదా వద్ద ప్రస్తావించగా.. విషయం తమ దృష్టికి రాలేదన్నారు. శనివారం తెలుసుకుంటానన్నారు.

నకిలీ ఇంజిన్ ఆయిల్ పట్టివేత

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: గీసుకొండ మండలం జాన్‌పాక్‌లో నకిలీ ఇంజిన్ ఆయిల్‌ను పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూదన్ తెలిపారు. సాంబరావు జన్‌పాక్‌లో ఆటో మొబైల్ దుకాణం ఉంది. రాంపూర్‌లో రిప్యాకింగ్ చేసిన ఇంజిన్ ఆయిల్ తెచ్చి, వివిధ కంపెనీల పేరుతో విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో గీసుగొండ పోలీసులతో కలిసి టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు చేశారు. ఆయిల్‌ను స్వాధీనం చేసుకొని, విచారణ కోసం మెట్రాలజీ విభాగం అధికారులకు అప్పగించారు.

ఆశాలపల్లి శివారులో రాయితీ బియ్యం..

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: రాయితీ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచిన కేంద్రంపై శుక్రవారం తమ పోలీసులు దాడి చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూదన్ తెలిపారు. వరంగల్ జిల్లా సంగెం మండలం ఆశాలపల్లి శివారుల్లో కిరణ్‌కుమార్ పౌల్ట్రీ ఫాంలో రాయితీ బియ్యం నిల్వ చేసినట్లు సమాచారం రావడంతో స్థానిక పోలీసులతో కలిసి తనిఖీ చేశారు. 31.86 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకొన్నారు. నిందితుడు కిరణ్‌కుమార్‌ను పట్టుకోగా.. మరో నిందితుడు రాజు పరారీలో ఉన్నట్లు ఏసీపీ తెలిపారు. స్వాధీనం చేసుకున్న బియ్యం, నిందితుణ్ని కేసు నమోదు కోసం సంగెం పోలీసులకు అప్పగించామని తెలిపారు.

వరంగల్‌క్రైం : గీసుగొండ ఠాణా పరిధి మొగిలిచర్లలోని కోళ్ల ఫారంలో అక్రమంగా నిలువ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. గ్రామ శివారులోని శ్రీధర్‌కు చెందిన భద్రకాళి కోళ్ల ఫారంలో రాయితీ బియ్యం ఉన్నట్లు సమాచారం రావడంతో తనిఖీలు నిర్వహించి రూ. 22,100 విలువ చేసే 08.50 క్వింటాళ్ల బియ్యం, హనుమకొండ ఠాణా పరిధి పెద్దమ్మగడ్డ వద్ద ఆటోలో వెంకటేశ్ తరలిస్తున్న బియ్యం పట్టుకున్నారు.

వ్యభిచార గృహంపై టాస్క్‌ఫోర్స్ దాడి

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: హనుమకొండ రెవెన్యూ కాలనీలో వ్యభిచార గృహంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూదన్ కథనం మేరకు... వరంగల్ దేశాయిపేటకు చెందిన మహిళ రెవెన్యూకాలనీలో ఇంటిని అద్దెకు తీసుకొని, ఇతర రాష్ట్రాల నుంచి యువతులను రప్పించి వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం రావడంతో సుబేదారి, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా దాడులు చేశారు. ఇద్దరు విటులు, ఇద్దరు యువతులు పట్టుబడ్డారు. నిర్వాహకురాలిని అరెస్టు చేసి, ఐదు చరవాణులు, రూ.2,350 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు, విచారణ కోసం సుబేదారి పోలీసులకు అప్పగించామని ఏసీపీ తెలిపారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రాజు, ఆర్ఎస్సై భానుప్రకాశ్, సిబ్బంది పాల్గొన్నారు.

పాత నేరస్థుడి అరెస్టు

మట్టెవాడ, న్యూస్‌టుడే: దారి దోపిడీకి పాల్పడిన పాత నేరస్థుడిని ఇంతేజార్‌గంజ్ ఠాణా పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఎస్సై వెంకన్న కథనం మేరకు.. గిర్మాజీపేటకు చెందిన పోలేపాక బాబు ఈ నెల 18న అర్ధరాత్రి వరంగల్ బస్టాండ్ సమీపం నుంచి వెళ్తున్నాడు. శివనగర్‌కు చెందిన చంద్రశేఖర్ అడ్డగించి బాబుపై దాడి చేశాడు. ఆపడానికి వచ్చిన మరో ఇద్దరిపై కత్తెరతో దాడి చేశాడు. అనంతరం అక్కడి నుంచి పారిపోయాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల ఆధారంగా చంద్రశేఖర్‌ను గుర్తించిన పోలీసులు వరంగల్ రైల్వేస్టేషన్ వద్ద అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. కాగా చంద్రశేఖర్‌పై గతంలో ఇంతేజార్‌గంజ్, కాజీపేట, ఘట్‌కేసర్, రాచకొండ, సికింద్రాబాద్ రైల్వే ఠాణాల్లో హత్యయత్నం, దారిదోపిడీ, చోరీల కేసులు నమోదు అయ్యాయి. కాజీపేట పోలీసులు పీడీ ఆక్టు నమోదు చేయడంతో సంవత్సరం జైలులో శిక్ష అనుభవించాడు. పదుల సార్లు జైలుకు వెళ్లినా ఎలాంటి మార్పు లేకపోవడంతో పోలీసులు మళ్లీ పీడీ యాక్టు నమోదు చేసే పనిలో ఉన్నారు.

భాజపాతోనే దేశాభివృద్ధి సాధ్యం

వర్ధన్నపేట, న్యూస్‌టుడే: భాజపాతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని ఆ పార్టీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ అన్నారు. ఇల్లంద దళిత బస్తీలో శుక్రవారం భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. భాజపా బలోపేతానికి నేతలు కృషి చేయాలని శ్రీధర్ సూచించారు. కార్యక్రమంలో భాజపా నేతలు వెంకటరమణ, కుమారస్వామి, తిరుపతిరెడ్డి, బాబురావు, అనిల్, సంపత్, దూడయ్య తదితరులు పాల్గొన్నారు.

కిట్స్‌లో వైభవంగా సంశోధిని-2024 ఫెస్ట్


గౌరవ్ కుమార్ అర్రాను సన్మానిస్తున్న అధ్యాపకులు

భీమారం, న్యూస్‌టుడే: హసన్‌పర్తి మండలం భీమారంలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో రెండ్రోజుల జాతీయస్థాయి విద్యార్థి సాంకేతిక సింపోజియం (సంశోధిని-2024) ఫెస్ట్ కార్యక్రమం శుక్రవారం వైభవంగా ప్రారంభం అయింది. హైదరాబాద్‌కు చెందిన జీఈ ఎలక్ట్రికల్ ఆర్ అండ్ డీ సీనియర్ ప్రిన్సిపల్ ఎంటర్‌ప్రైజ్ ఆర్కిటెక్ట్ గౌరవ్‌కుమార్ అర్రా ముఖ్య అతిథిగా పాల్గొని, జ్యోతి వెలిగించి వేడుకను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్టార్టప్‌లపై ఇన్నోవేషన్, ఇండస్ట్రీ దృక్పథంలోని ముఖ్యాంశాలను విద్యార్థులకు వివరించారు. కిట్స్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.అశోక్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇలాంటి సాంకేతిక సింపోజియంలు సృజనాత్మకమైన ఆవిష్కరణలను ఎంతో దోహదం చేస్తాయన్నారు. సంశోధిని-2024 థీమ్ ముఖ్య ఉద్దేశం ఎల్లలు దాటిన ఆవిష్కరణలే అన్నారు. కిట్స్ గవర్నింగ్ బాడీ సభ్యులు, విశ్రాంత న్యాయమూర్తి కె.దేవీప్రసాద్ మాట్లాడుతూ.. ఆవశ్యకతే ఆవిష్కరణకు తల్లి అన్నారు. అనంతరం కిట్స్ విద్యార్థులు రూపొందించిన సంశోధిని-24 సీడీలను అతిథులు ఆవిష్కరించారు. వి.పవన్‌కుమార్, ప్రోగ్రాం కన్వీనర్ ఎం.శ్రీలత, ఎం.నర్సింహారావు, టి.మధుకర్‌రెడ్డి, సునీల్ ప్రతాప్‌రెడ్డి, బి.విజయ్‌కుమార్, డి.ప్రభాకరాచారి, విద్యార్థి చాప్టర్ అధ్యక్షులు అభిచరణ్, టెక్నికల్ క్లబ్ విద్యార్థి ప్రధాన కార్యదర్శులు నిషాత్ సుల్తానా, వి.సిద్ధార్థ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విన్యాసం!



మట్టెవాడ, న్యూస్‌టుడే: కాశీబుగ్గ సమీపంలోని ఓ ప్రైవేటు పాఠశాల విద్యార్థి శుక్రవారం ద్విచక్ర వాహనం నడుపుతూ విన్యాసం చేస్తున్నాడు. ఈ చిత్రం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టడంతో స్పందించిన వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ ద్విచక్ర వాహనం నంబరు ఆధారంగా వివరాలు రాబట్టారు. వాహనం ఇచ్చిన వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థి వినియోగించిన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని ఠాణాకు తరలించారు. బాలుడితోపాటు వాహనం ఇచ్చిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

రెజ్లింగ్‌లో రాణించిన క్రీడాకారులు


పతకాలు సాధించిన రెజ్లర్లతో జిల్లా క్రీడాధికారి అశోక్‌కుమార్

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి అండర్-19 రెజ్లింగ్ పోటీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా రెజ్లర్లు పతకాలతో రాణించారు. హైదరాబాద్‌లో ఈనెల 15, 16 తేదీల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్ఐ) ఆధ్వర్యంలో రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన రెజ్లర్లు గణేష్ 63 కిలోల గ్రీకో రోమన్ విభాగంలో స్వర్ణం, ఫ్రీ స్టైల్ 92 కిలోల విభాగంలో సాయి వర్ధన్ స్వర్ణం సాధించి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. 86 కిలోల ఫ్రీస్టైల్ విభాగంలో అన్విత్, 82 కిలోల గ్రీకో రోమన్ విభాగంలో చరణ్ రజత పతకాలు సాధించారు. వరుణ్, ఈశ్వర్, డాన్, సాయి నిహాల్ తమ విభాగాల్లో కాంస్య పతకాలు గెలుచుకున్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులు, కోచ్ రాజును హనుమకొండ జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి, అండర్-19 ఎస్‌జీఎఫ్ఐ కార్యదర్శి అశోక్‌కుమార్ అభినందించారు.

నర్సంపేట నియోజకవర్గం


కార్మికుల సమస్యలపై పోరాటం చేయాలి

చెన్నారావుపేట, న్యూస్‌టుడే: టీయూసీఐ కార్మిక సంఘంలో ఐఎఫ్‌టీయూ విలీన సభను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి వడ్డూరి రాజు సూచించారు. ఈ నెల 20న హైదరాబాద్‌లో జరగనున్న విలీన సభకు సంబంధించిన గోడ పత్రికలను శుక్రవారం చెన్నారావుపేటలో ఆవిష్కరించారు. రాబోయే రోజుల్లో కార్మికుల సమస్యలపై పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జవహర్‌లాల్, వీరారెడ్డి, ఉప్పలయ్య, శ్రీను, భిక్షపతి, రాజు, పాష తదితరులు పాల్గొన్నారు.

విలీన నిర్ణయాన్ని విరమించుకోండి

నర్సంపేట గ్రామీణం,న్యూస్‌టుడే: నర్సంపేట పురపాలికలో మహేశ్వరం, నాగుర్లపల్లి, రాములునాయక్‌తండా గ్రామాలను విలీనం చేయాలనే నిర్ణయాన్ని విరమించుకోవాలని ఆయా గ్రామాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వినతి పత్రాలు అందజేశారు. పేద, మధ్య తరగతి ప్రజలపై పన్నుల భారం పడుతుందన్నారు. బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు సాగర్, రామచంద్రు, రాములు, కిరణ్ గౌడ్ తదితరులున్నారు.


తాగునీటి సరఫరాపై అవగాహన అవసరం


ఖానాపురంలో మాట్లాడుతున్న డీఈఈ దేవేందర్‌రెడ్డి

ఖానాపురం,న్యూస్‌టుడే: గ్రామాల్లో మిషన్‌భగీరథ నీరు కలుషితం కాకుండా సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని భగీరథ డీఈఈ దేవేందర్‌రెడ్డి అన్నారు. ఖానాపురంలో తాగునీటి సరఫరా సిబ్బంది, పంప్ ఆపరేటర్లకు శుక్రవారం నిర్వహించిన శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. పైపులైన్ల మరమ్మతులపై ఎస్‌ఈ సురేందర్ వివరించారు. కార్యక్రమంలో డీఎల్పీవో రాజీవ్, ఎంపీడీవో భారతి, ఏఈ మౌనిక, ఎంపీవో సునీల్ రాజ్, మెకానిక్ రమేష్, సిబ్బంది మహేందర్, హరీష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నెక్కొండ : మండలంలోని ప్రజలకు శుభ్రమైన నీరందించాలని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంచినీటి సహాయకులకు శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. మిషన్ భగీరథ ఏఈ రాజేష్ మాట్లాడుతూ.. మిషన్ భగీరథ నీటి సరఫరాపై సహాయకులకు అవగాహన ఉండాలన్నారు. సమావేశంలో మిషన్ భగీరథ ఏఈఈ వంశీ, శిక్షకులు అవినాష్, శ్రీకాంత్, మంచినీటి సహాయకులు పాల్గొన్నారు.

పత్తి పంట పరిశీలన


వేపచెట్టుతండా శివారులో చేనును పరిశీలిస్తున్న ఓడీసీఎంఎస్ ఛైర్మన్, భారాస నేతలు

ఖానాపురం,న్యూస్‌టుడే: వర్షాలతో పంటలు నష్టపోయిన పత్తి రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని ఓడీసీఎంఎస్ ఛైర్మన్ రామస్వామినాయక్, మాజీ ఎంపీపీ ప్రకాశ్‌రావు అన్నారు. వారు శుక్రవారం వేపచెట్టుతండాలో పత్తి చేలను పరిశీలించారు. పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందించాలన్నారు. నేతలు వెంకట్రాంనర్సయ్య, మౌలానా, బాలు, వెంకన్న, ప్రవీణ్, యాదగిరి, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

నల్లబెల్లి : అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని భారాస మండల కన్వీనర్ భానోత్ సారంగపాణి అన్నారు. మూడుచెక్కలపల్లిలో దెబ్బతిన్న పత్తి పంటను భారాస నాయకులు పరిశీలించారు. రూ. 7500 మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. మురళీధర్, ప్రవీణ్, శివారెడ్డి, దేవునాయక్ పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై విద్యార్థుల ఆందోళన



వర్ధన్నపేట, న్యూస్‌టుడే: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు శుక్రవారం ఆందోళనకు దిగారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందు వరంగల్- ఖమ్మం జాతీయ రహదారిపై బైఠాయించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విద్యార్థులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు.